

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

శనివారం, 28 జూన్ 2025

8 పేజీలు

## అంగన్వాడీ కేంద్రాల్లో 5 సంవత్సరాలు నిండిన పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయాలి

**- సిడిపివోలు, యంఇవోలు సమన్వయంతో పనిచేయాలి : జిల్లా కలెక్టర్**




**ఏలూరు,మేజర్‌న్యూస్ :** అంగన్వాడీ కేంద్రాల్లోని 5 సంవత్సరాలు నిండిన పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేసేందుకు సిడిపివోలు, యంఇవోలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు.జీరో ఎన్రోల్మెంట్ కలిగిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ఐసిడిఎస్ అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీరోనమోదుఉన్న పాఠశాలల ప్రధానో పాధ్యాయులు అంగన్వాడీ కేంద్రాల్లోని 5 సంవత్సరాలు నిండిన పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేసేందుకు కృషి చేయాలన్నారు.ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.హేబిటేషన్‌లో పిల్లలు లేరని పేర్కొన్న మండల విద్యాశాఖ అధికారులు, సిడిపివోలు, హేబిటేషన్‌లో పిల్లలు లేరని ధృవీకరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. సమావేశంలో ఐసిడిఎస్‌పిడి పి.శారద, డిఇఓ యం.వెంకటలక్ష్మమ్మ, మండల విద్యాశాఖ అధికారు లు, డిప్యూటీ విద్యాశాఖ అధికారులు, ఐసిడిఎస్ సిడిపివోలు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం

### - ప్రధానిగా రాహుల్ గాంధి

**ప్రధాని మోడీకి యోగాపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధిపై లేదు**





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, భారత ప్రధానిగా రాహుల్ గాంధీ అవ్వడం ఖాయమని ఆంధ్ర ప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీ విస్తృతస్తాయి సమావేశం షర్మిలారెడ్డి శుక్రవారం పాల్గొన్నారు, "ఏలూరులో నేరెళ్ళ రాజా కళ్యాణమండపంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా నలు మూలల నుండి కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావడంతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుందా' అన్నట్టు కళ్యాణ మండపమంతా కాంగ్రెస్ నాయకులతో కిక్కిరిసి పోయింది, దీనితో జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని,కాంగ్రెస్ శ్రేణులు, చెప్పుకుంటున్నారు,ఈ సమావేశంలో షర్మిలా రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ యోగాకిచ్చిన ప్రాధాన్యత దేశ అభివృద్ధికి ఇవ్వలేదని విమర్శించారు, భవిష్యత్‌లో కొన్ని పార్టీలు' కాంగ్రెస్‌లో విలీనం అయ్యే అవకాశం ఉందన్నారు, ఎపీ విభజన హామీలపై

- తరువాయి 2లో..

## పోగొండ రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి ముగ్గురు యువకుల మృతి



**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్ :** ఆడుతూ పాడుతూ సరదాగా గడుపుదాం అనుకున్న యువకుల ఆశలు ఆవిరైపోయాయి. ఆసరదా క్షణాల్లో ముగ్గురి యువకుల పాలిట శాపం అయింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బుట్టాయిగూడెం మండలం అచ్చయ్యపాలెం పంచాయతీ పరిధిలోని చిన్నరవ్వవారి గూడెం గ్రామానికి చెందిన యువకులు సమీపంలోని చింతలగూడెం గ్రామ సమీపంలోని పోగొండ రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈత కొడుతున్న సమయంలో మునిగి ముగ్గురు యువకులు మృతి చెందిన విషాధ సంఘటన చోటుచేసుకుంది. చిన్నరవ్వవారి గూడెం గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు సీత రాముడు(30),కిశోర్,(26)

- తరువాయి 2లో..

## భీమవరంలో అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలి

**- అధికారులకు జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం**



**భీమవరం,మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లాకలెక్టర్ చదలవాడ నాగరాణి భవ్య భీమవరం, పారిశుధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల ఆక్రమణల తొలగింపు, తదితర అంశాలపై జిల్లాజాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డిఓ కే. ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవ్య భీమవరం ప్రాజెక్టులో భాగంగా పట్టణంలో దాతల సహకారంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ఇంకా ప్రారంభం కాని పనులు ప్రారంభించేందుకు దాతలతో సంప్రదించి పనులు ప్రారంభించేందుకు మున్సిపల్ అధికారులుప్రత్యేకశ్రద్ధ తీసుకోవాల న్నారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న పాత బస్టాండ్ పనులు, పట్టణంలో పార్కులలో ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో రోడ్డు మార్జిన్లుఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారని అటువంటి వారిని గుర్తించి తొలగించాలన్నారు. అదేవిధంగా అనుమతి లేకుండా ఎక్కడబడితే అక్కడ పెద్ద పెద్ద హోర్డింగులను ఏర్పాటు చేస్తున్నారని వాటిని తక్షణమేతొలగించే చర్యలు తీసుకోవాల న్నారు. వాహనాల

- తరువాయి 2లో..

## గేదెల తలలు నరికిన గుర్తు తెలియని కిరాతకులు





**లింగపాలెం,మేజర్‌న్యూస్:**–లింగపాలెం మండలం మఠం గూడెం గ్రామపంచాయతీ శివారు సుందరరావు పేట గ్రామంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తొర్లపాటి రవి అనే వ్యక్తి పాకలో మూడు గేదెలను రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అతి క్రూరంగా తలలు నరికి చంపారు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ వారికి తెలియపరచగా వారు హుటాహుటిన వచ్చి పరిస్థితిని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఇలాంటి సంఘటనలు మరలా పునరావృతంకాకుండా నిందితులను త్వరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## ఫోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలుశిక్ష

- రూ.5వేలు జరిమానా
- బాధితురాలికి పరిహారం రూ.50వేలు చెల్లించాలి
- స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కుమారి కె.వాణి తీర్పు

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఫోక్సో కేసులో వేగవంతమైన దర్యాప్తు ఒకటిన్నర సంవత్సర కాలంలోనే ముద్దాయికి శిక్ష పడేలా చర్యలు తీసుకున్న ఏలూరు జిల్లా పోలీసులు. నిందితుడు షేక్ ఇబ్రాహిం అనే 45 సంవత్సరాల వ్యక్తిసాయి బాబా దేవాలయం వెనుక భాగంలో,సుబ్బంపేట కాలనీ,జంగారెడ్డిగూడెం నివాసికి పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కుమారి కె.వాణి నిందితుడికి 20 సంవత్సరాలు జైలుశిక్ష,5వేల రూపాయలు

- తరువాయి 2లో..

# విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి






ఏలూరు,మేజర్‌న్యూస్ : ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సమావేశం ఆర్ఆర్‌పేట స్ఫూర్తి భవన్లో యూనియన్ జిల్లా కోశాధికారి మల్లేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది.ఈ సమావేశంలో విద్యుత్తు మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే,జిల్లా నాయకులు పి కిషోర్ మాట్లాడుతూ ఎస్ క్రో అకౌంట్ ను తక్షణమే ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు.స్మార్ట్ మీటర్లు వచ్చిన నేపథ్యంలో మీటర్ రీడర్స్‌కు విద్యుత్ శాఖలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి ఆదుకోవాలి అన్నారువిద్యుత్తు మీటర్ రీడర్స్ విద్యార్హతను బట్టి (టెక్నికల్,నాన్ టెక్నికల్) షిఫ్ట్ ఆపరేటర్లుగా ,కంప్యూటర్ ఆపరేటర్లు గాను,మిగిలిన వారికి వాచ్మెన్,అటెండర్ పోస్టులను కేటాయించాలని డిమాండ్ చేశారు.మీటర్ రీడర్స్ రాష్ట్ర అధ్యక్షులు.ఎల్.రామకృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు.పి.జాకబ్ మాట్లాడుతూ మీటర్ రీడర్స్ కాంట్రాక్టర్లతో విద్యుత్ శాఖ అధికారులతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శులు. జి.దుర్గారావు, స్వామి, శంకర్ అప్పారావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ. శేఖర్ నాగేశ్వరావు, శ్రీధర్,ప్రకాష్, ధర్మరాజు,మురళీ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పోగొండ రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి ముగ్గురు యువకుల మృతి

మొదటిపేజీ తరువాయి

దేవంద్ర(18),అనే యువకులుగా చెబుతున్నారు.ఈత కొడుతున్న సమయంలో ఒక యువకుడ్ని కాపాడేందుకు ఇద్దరి ప్రయత్నించగా నది ప్రవాహం బాగా ఎక్కువగా ఉండటంతో ముగ్గురు మృతి చెందారని చెబుతున్నారు. బుట్టాయిగూడెం ఎస్సై మహేశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పోగొండ ప్రాజెక్టులో ఈతకు వెళ్లి మృతి చెందిన యువకుల కుటుంబాలను ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుండి రావలసిన అన్ని అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. – యువకుల మృతిపై మంత్రి పార్థసారథి దిగ్భ్రాంతి –బుట్టాయగూడెం మండలం అచ్చిపాలెం గ్రామానికి చెందిన గ్రామకమిటీ అధ్యక్షులు మడి సోమరాజు కుమారుడు,వారి స్నేహితులు దండుపూడి సమీపంలోని బైనేరు వాగులో స్నానాలకు దిగి ముగ్గురు యువకులు మృతి చెందడంపై రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతి వ్యక్తంచేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

# మంత్రిచే మల్లవల్లి కుటుంబానికి రూ.10వేలు సహాయం



ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్ : అపత్కాలంలో ఉన్న నిరు పేదలకు మెరుగైన వైద్యం కోసం సొంత నగదు అందజేసి అండగా నిలుస్తున్న రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆగిరిపల్లి మండలం నూగుండపల్లి గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు,మాజీ ఎమ్.పి.టి.సి,మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మల్లవల్లి కోటేశ్వరరావు అనారోగ్యంతో బాధ పడుతున్నారని తెలిసి మంత్రి వర్యులు పరామర్శించి, యోగ క్షేమాలు తెలుసుకొని,కుటుంబానికి రూ,10వేలు ఆర్థిక సహాయంఅందించిన మంత్రి కొలుసు పార్థసారథి, అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారని వారి కుటుంబ సభ్యులు మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకురాగా వెనువెంటనే మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులకు సొంత నగదు అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గుర్తు తెలియని మహిళ చికిత్స పొందుతూ మృతి



ఏలూరు,మేజర్‌న్యూస్ : గుర్తుతెలియని మహిళ అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఏలూరు సర్వజన ఆస్పత్రిలో గత కొంతకాలంగా ఎవరు లేకుండా ఒంటరిగా తిరుగుతూ ఉన్న గుర్తు తెలియని (50) ఏళ్ల మహిళ ఈనెల 25న ఆస్పత్రి ఆవరణలో అస్వస్థతకు లోనైంది. గమనించిన వైద్యులు ఆమెకు చికిత్స అందించారు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వైద్య సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు.

# కోకో రైతులు 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఏలూరు,మేజర్‌న్యూస్ : ప్రభుతం అందిస్తున్న రాయితీ ద్వారా కోకో రైతులు అమ్మే రైతులు ఉద్యానవన శాఖ కు ఈనెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉద్యావన శాఖాధికారి ఎస్. రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 23వ తేదీన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్, కోకో రైతులతో నిర్వహించిన సమావేశంలో కోకో రైతులకు కోకో కంపెనీ వారు 450లు,రాష్ట్ర ప్రభుత్వం రాయితీ కె.జి. ఒక్కంటికి 50 రూపాయలు చొప్పున అందిస్తూ మొత్తం కె.జి.500 రూపాయలకు కొనుగోలు చేయాలనీ నిర్ణయించారని, గత నెల 26వ తేదీ నుండి కోకో రైతులు ఉద్యావన శాఖ వద్ద పేర్లను నమోదు చేసుకుని కంపెనీ వారికి అమ్మడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1536 మెట్రిక్ టన్నుల కోకో గింజలను మొండోలైజ్, డి.పి.,చాకోలెట్ ,ఇతరుల ద్వారా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కావున కోకో రైతు సోదరులు అందరు ఈనెల 30వ తేదీ లోగా తమ కోకో గింజలను రైతు సేవా కేంద్రంలో పెర్మిట్స్ తీసుకోని మీ సమీపంలో గల కంపెనిల వారికి అమ్ముకోవలసిందిగా రామ్మోహన్ తెలియజేశారు.

# వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం - ప్రధానిగా రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి

ఎవ్వరూ మాట్లాడటం లేదన్నారు,కొన్ని పార్టీలు మోదీతో అక్రమ పొత్తులు పెట్టుకుని ఏపీ విభజన హామీల పై నోరెత్తడం లేదని షర్మిల విమర్శించారు, చంద్రబాబు మద్దతు తోనే మోదీ ప్రధాని అయ్యారని అయినా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వెనుకబడిందన్నారు. ప్రధాని మోదీ 11సంవత్సరాలుగా అధికారంలో ఉన్నారని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా మాత్రం ఇవ్వలేదని, పోలవరం, అమరావతి రాజధానికి నిధులుసరిగా ఇవ్వలేదని,విశాఖ ఉక్కుపై స్పష్టమైన హామీ ఇవ్వలేదని అన్నారు. ఇటీవల విశాఖపట్టణం వచ్చినప్రధానియోగా చేసి వెళ్లిపోయారని,యోగాపై ఉన్న శ్రద్ధ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలపై లేదని అన్నారు.వినే వారు ఉంటే వైసిపి వాళ్లు ఏమైనా చెబుతారని అంటూ షర్మిలా రెడ్డి కేంద్ర రాష్ట్ర రాజకీయాల పై విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షురాలు జిల్లాలో నియోజక వర్గాల వారిగా పార్టీ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పార్టీ బలోపేతం పై ప్రత్యేకంగా చర్చించారు, ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు రాజనాల రామోహనరావు,మాజీ ఎమ్మెల్యే వి,ఆర్ ఎలీజా,కావూరిలావణ్య,జిల్లా కాంగ్రెస్ఆసెంబ్లీ కన్వీనర్లు, అధ్యక్షులునాయకులు,మహిళాకార్యకర్తలు,పాల్గొన్నారు.

# భీమవరంలో అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలి

మొదటిపేజీ తరువాయి

పార్కింగ్కు ప్రదేశాలు గుర్తించి మార్కింగ్ చేయాలని ఆ ప్రదేశంలోనే వాహనాలుపార్కింగ్ చేసేలాచర్యలు తీసుకోవాలన్నారు. తాను ఆకస్మికంగా పర్యటిస్తానని పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటానన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా త్రాగునీరు కలుషితం కారణంగా ప్రజలు డయేరియాబారినపడకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.జిల్లాలో ఇప్పటికే ప్లాస్టిక్ నిషేధం ఉన్నందున ఎక్కడ కూడా ప్లాస్టిక్ వాడకుండా నిఘ పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, భీమవరం మునిసిపల్ కమీషనర్ కె.రామచంద్రా రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి పార్థసారథి, అసిస్టెంట్ కమీషనర్, హెల్త్ ఆఫీసర్, మున్సిపల్ ఇంజనీర్లు, డిఇలు పాల్గొన్నారు.

# ఫోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలుశిక్ష

మొదటిపేజీ తరువాయి

జరిమానా,బాధితురాలికి పరిహారం రూ.50వేలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.నిందితుడు జంగారెడ్డి గూడెం నందు ఒక మెడికల్ షాపును నిర్వహిస్తూ, బాధిత బాలికను పాఠశాలకు ట్యూషన్ సెంటర్ వెళ్ళే సమయాలలో తినుబండారాలు ఇచ్చి లోబర్చుకొని,గత ఏడాది ఫిబ్రవరం 6వ తేదీ ముందు వరకు బాలిక పై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు తరచూ ఆలస్యంగా ఇంటికి వస్తుండటాన్ని గమనించిన బాలిక నానమ్మ బాలికని ప్రశ్నించింది. పై నేరం గురించి తెలుసుకొని,అనంతరం గత ఏడాది ఫిబ్రవరి 10 తేదీన జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్లో రిపోర్ట్‌ఇవ్వగా, కేసునమోదు చేయబడింది. దర్యాప్తు అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అధికారి జి.జ్యోతిబాస్,అప్పటి ఎస్.ఐ,జంగారెడ్డిగూడెంపోలీస్ స్టేషన్ (ప్రస్తుతం నూజివీడు టౌన్ పోలీస్ స్టేషన్‌లో)దర్యాప్తు చేసిన అధికారులు ఎం.ధనుంజుడు,అప్పటి ఎస్.డి.పి.ఓ, జంగారెడ్డిగూడెం,ఉ.రవి చంద్ర, ఎస్.డి.పి.ఓ,జంగారెడ్డిగూడెం,ప్రాసిక్యూషన్ సహాయక బృందం,వి. అమర శ్రీనివాస్, ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది, పాక్సోకోర్టు, ఏలూరు,ఎం. సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మహిళాపోలీస్ స్టేషన్, ఏలూరు,ఐ/సి కోర్టుమానిటరింగ్ సెల్ ఏం.వి సుబాష్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, జంగారెడ్డిగూడెం సర్కిల్ ఎస్ కె జాబిర్, సబ్ ఇన్‌స్పెక్టర్ఆఫ్ పోలీస్, జంగారెడ్డిగూడెం. ఎం.వి. రమణ,మహిళా పోలీస్ స్టేషన్, ఏలూరు,ఎం. శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ 1838, కోర్టుమానిటరింగ్ సెల్ ఎం. నాగేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ 394, జంగారెడ్డిగూడెంపోలీస్ స్టేషన్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కుమారి కె.వాణి నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష , రు. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ముద్దాయి కి శిక్ష పడుటకు సహకరించిన పై సిబ్బందిని జిల్లా ఎస్ పి ప్రతాప్ శివ కిశోర్ అభినందించారు.

# వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన



పాలకోడేరు,మేజర్ న్యూస్: పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ ఆదేశానుసారం శుక్రవారం గొరగనమూడి గ్రామంలో వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్యసిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సంబంధిత సిబ్బంది మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కువగా త్రాగునీరు కలుషితం అయ్యే అవకాశాలు ఉంటాయని. కలుషిత నీరు త్రాగడం వల్ల డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని అందువల్ల ముందుగానే తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల త్రాగునీటి వల్ల వచ్చే వ్యాధులను అరికట్ట వచ్చిందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిని కాచి చల్లార్చి త్రాగడం వల్ల నీటిలో ఉండే బ్యాక్టీరియా వల్ల కలిగే ప్రాణాంతక వ్యాధులు సంభవించకుండా ఉంటాయన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖల ద్వారా సరఫరా చేసే ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను నీటిలో కలుపుకుని తాగడం వల్ల డిహైడ్రేషన్ నుండి ఉపశమనం పొందొచ్చు అన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు నిలవ ఉండే అవకాశాలు ఎక్కువగా ఉండటంవల్ల దోమలు చేరి ప్రాణాంతకమైన డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలకుండా ఇంటి పరిసర ప్రాంతాలలో ఎప్పటికప్పుడు నీరు నిలవ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ విజయ ప్రసాద్, ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, వేదకుమారి,సుజాత, ఆశా కార్యకర్తలు శాంత కుమారి, ఎం వి ఎస్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు బార్ అసోసియేషన్ సభ్యుల ప్రమాణ స్వీకారం





ఏలూరు,మేజర్ న్యూస్ : ఏలూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కోనే సీతారామరావు శుక్రవారం బార్ అసోసియేషన్ హాల్ నందు ప్రమాణ స్వీకారం చేశారు. వైస్ ప్రెసిడెంట్ గా నిస్సంకర కృష్ణారావు, జనరల్ సెక్రెటరీగా నోముల రాముడు,జాయింట్ సెక్రెటరీగా మహమ్మద్ ఇబ్రహీం షరీఫ్, కోశాధికారిగా గండికోట సీతారామరాజు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా గెద్దా విజయభాస్కర్, లైబ్రరీ సెక్రెటరీగా కొటారి కృష్ణకిశోర్, ఎల్ ఆర్ లేడీ రిప్రెజెంటేటివ్ గా పుట్ట కనకదుర్గాభవాని ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారిగా ఎంవి నారాయణరాజు వ్యవహరించారు. నూతనంగా 10 ప్రమాణం చేసిన అధ్యక్ష కార్యవర్గాన్ని తోటి అడ్వకేట్స్ అభిమానులు పూలమాలతో శాలువాలతో ముంచెత్తి అభినందించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడుతో పాటు అడ్వకేట్ ఏలూరు వెంకటేశ్వరరావు రూ. 50వేలు ఏవి నారాయణ రూ. 25 వేలు విరాళంగా కోర్టు భవనాల విద్యుత్ సర్వీస్ పునరుద్ధరణకు ఆర్థిక శాఖకు అందించారు. అంతకుముందే ఈ సర్వీస్ పునరుద్ధరణకు అధ్యక్షులు కోనే సీతారామరావు రూ. 1 లక్ష రూపాయలు ప్రకటించిన సంగతి విధితమే.

# అనాధలకు,అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలి



ఆగిరిపల్లి, మేజర్ న్యూస్: రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంరక్షణ కేంద్రాలలోను,సంరక్షకుల వద్ద ఆశ్రయం పొందుతూ పద్దెనిమిది సంవత్సరాలు నిండిన అనాథలందరికి ప్రత్యేక రేషన్ కార్డులు మంజూరు చేయాల్సిన అవసరముందని కాసా జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ పూర్వపు రీజినల్ కోఆర్డినేటర్ పి.ఎస్.వర కుమార్ రాష్ట్రముఖ్యమంత్రికి శుక్రవారం విజ్ఞప్తి చేశారు.అన్ని రకాల జీవన ప్రయోజనాలకు రేషన్ కార్డు ఒక అర్హతగా ఉన్నందున ఎవ్వరూ లేని అనాథలకు రేషన్ కార్డు అవసరమన్నారు.ఏ అనాథ ఆశ్రమాలైనా,ఆశ్రయాలైన అనాధబాలలు వయోజనులైన వారిని సంరక్షించడం సాధ్యం కాదన్నారు. ఈమేరకు ముఖ్యమంత్రికి లేఖవ్రాసామన్నారు. అలాగే గతప్రభుత్వం అత్యంత దుర్మార్గముగా రద్దు చేసిన రేషన్ కార్డులను పునరుద్ధరించాలని మరో లేఖలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి ముందు ఆరు నెలల విద్యుత్ బిల్లులు ఆధారముగానూ,ఆదాయపన్ను రిటర్న్ దాఖలు చేసిన వారి కార్డులు రద్దు చేయడం దుర్మార్గమన్నారు.ఏ ప్రభుత్వ లేదా ప్రవేటు బ్యాంక్ ఋణము కావాలన్నా ఆదాయపన్ను రిటర్న్ అడుగుచుండుట వలన చిన్న చిన్న రుణాలకు సహితం ఆదాయపన్ను రిటర్న్ చేసిన వారందరికీ రేషన్ కార్డులు రద్దు చేశారన్నారు. ఆదాయపన్ను చెల్లించడానికి, రిటర్న్ దాఖలు చేయడానికి వున్న తేడాను ప్రభుత్వం గుర్తించాలన్నారు. కరెంటు బిల్లు ఆధారంగా రేషన్ కార్డు రద్దు చేయవలసి వస్తే ప్రతీ ఎప్పుడో ఆరు సంవత్సరాల క్రితం తీసిన రీడింగ్ కాకుండా ప్రతీ ఆరునెలలకు రీడింగ్ తీసి అర్హత గలవారికి రేషన్ కార్డులు మంజూరు చేయడం విద్యుత్ బిల్లు ఎక్కువ వచ్చిన వారికి ప్రతీ ఆరు నెలలకు రేషన్ కార్డులు రద్దు చేసుకుంటూ పోవాలన్నారు. ప్రభుత్వం ప్రస్తుత నిబంధనలను సవరించి అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## మద్యం మత్తులో కర్రతో దాడి చేయగా వృద్ధుడు మృతి



లింగపాలెం,మేజర్ న్యూస్ : మద్యం మత్తులో వ్యక్తి వృద్ధుడిని కర్ర తో తలపై మోదగా అతను చికిత్స పొందుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ ఘటన లింగపాలెం మండలం ఆసన్నగూడెం గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. చికిత్స నిమిత్తం అతని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ఆసన్నగూడెం గ్రామానికి చెందిన తోకల శోభనాద్రి (75)గా పోలీసులు గుర్తించారు. అతనిపై దాడి చేసిన వ్యక్తి మోదుగు సంజీవరావు అలియాస్ సంజు అని స్థానికులు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న ధర్మాజీగూడెం ఎస్ఐ వెంకన్న వివరాలు సేకరిస్తున్నారు.

## నేడు కళాకారుల సంఘం 157వ నెల వారీ సభ

తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ : రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 157వ నెలవారీ సభా కార్యక్రమం స్థానిక నంది బొమ్మ సెంటర్ విఘ్నేశ్వర రామాలయం ప్రాంగణంలో 28 తేదీ శనివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, కోశాధికారి మాసా బాబురావు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. తాడేపల్లి గూడెం హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగి శ్రీనివాస రావుకు గౌరవ సత్కారం, విశ్రాంత కార్యనిర్వాహక ఇంజనీరు, గాయకుడు తాడూరి వెంకట శేషగిరిరావుకి కళా సత్కారం, ఉద్యోగ సేవా పురస్కారం రామచంద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టి బి యూనిట్ పర్యవేక్షకులు, నటుడు, గాయకుడు పెమ్మరాజు సురేష్ కు ఉద్యోగ సేవా పురస్కారం అందజేస్తారు. తీవ్ర అనారోగ్యంతో, పేదరికంతో ఇబ్బంది పడుతున్న అనుకరణ (డూప్స్) నృత్య కళాకారుడు జు.నాగార్జునకు ఆర్థిక సత్కారం నిర్వహిస్తారు. సభకు ముందు సినీ సంగీత విభావరి, అనుకరణ నృత్యాలు ప్రదర్శిస్తారు.ప్రముఖ శిల్పి డా. శ్రీనాథ రత్న శిల్పి వుడయార్ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె దేవకిరాణి వుడయార్ వితరణతో పేద కళాకారులకు వస్త్ర దానం చేస్తారని అధ్యక్షులు రమణ తెలియజేశారు.

## గొర్రెల మేకల పెంపకం దారుల సంక్షేమానికి ప్రభుత్వం అండ

**- ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**



పెదవేగి,మేజర్‌న్యూస్ : రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మేకలు,గొర్రెలలో నట్టల నివారణ మందుల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం భోగాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించి గొర్రెలకు నట్టల నివారణ మందులను స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేకలు,గొర్రెలలో నట్టల నివారణకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని రైతులు, పెంపకం దారులు ప్రతి ఒక్కరు కూడా సద్వినియోగంచేసుకోవాలి అని,ఈ కార్యక్రమంలో జీవాలకు ఔషధాలను పూర్తి ఉచితంగా అందించడం జరుగుతుంది అని స్థానిక పశు సంవర్ధక శాఖ అధికారులను సిబ్బందిని కలిసి కేటాయించిన తేదీలలో వారి జీవాలకు ఈ మందును వేసే కార్యక్రమాన్ని తేదీని నిర్ధారించుకునించుకోవాలని సూచించారు. జూలై 10వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ సహా పలువురు సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతి కేసు

# దర్యాప్తు ఇంకా కొనసాగుతోందా ?

- పోలీసుల నుండి అందిన సమాచారంతో వెలుగు చూస్తున్న విషయం
- ఏపీ యునైటెడ్ లాయర్స్ ఫ్రంట్ అధ్యక్షులు జి.రోనాల్డ్ రాజు వెల్లడి



**ఏలూరు,మేజర్‌న్యూస్** : రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం కలిగించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతుందా?అయితే ఆయన మద్యం సేవించి, స్వయంగా రోడ్డు ప్రమాదానికి గురై, బుల్లెట్ మోటార్ సైకిల్ పై నుండి పడి, తీవ్ర గాయాలతో మరణించినట్లు సిట్ అధికారులు ప్రకటించారని, కానీ తాను సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసే నిమిత్తం అడిగిన సమాచారానికి రాజమండ్రి పోలీసు సమాచార అధికారి, డిఎస్పి లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంతో కేసు ఇంకా దర్యాప్తులో ఉన్నట్టు భావించాల్సి వస్తోందనిఆంధ్రప్రదేశ్ యునైటెడ్ లాయర్స్ ఫ్రంట్ అధ్యక్షులు, ఏపీ,తెలంగాణ రాష్ట్రాల హైకోర్టుల న్యాయవాది గొట్టుముక్కల రోనాల్డ్ రాజు శుక్రవారం తెలిపారు. గతంలో ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నేతృత్వంలోని సిట్ బృందం ఈ కేసు దర్యాప్తు ముగిసింది అని చెప్పారని పేర్కొన్నారు. అయితే తాను సమాచార హక్కు చట్టం ప్రకారం సైంటిఫిక్, డిజిటల్ వివరాలు, దర్యాప్తు పూర్తి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్,ఆర్ డిఓకు సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేశానని తెలిపారు. దీనికి ఈనెల 24వ తేదీన రాజమండ్రి డిఎస్పి, పోలీసు శాఖ సమాచార అధికారి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పాస్టర్ ప్రవీణ్ మృతి కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, తుది నివేదిక ఇంకా సిద్ధంగా లేదని, కేసు పూర్వపరాల వివరాలు ఈ పరిస్థితుల్లో ఇవ్వలేమని వివరించారని తెలిపారు. ఈ సమాధానంతో తనకు ఇంకా సందేహం కలుగుతోందని, కేసు దర్యాప్తులో ఉన్నట్లుగా విదిత మౌతోందని న్యాయవాది వివరించారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్,శవ పంచనామా నకలు, పోస్టుమార్టం నివేదిక, కెమికల్ ఎనాలసిస్, కాలి తొడపై కాలిన గాయం వివరాలు, మధ్యవర్తుల నివేదిక, రసాయనాల వివరాలు, పాస్టర్ ప్రవీణ్ ల్యాప్టాప్,ఐఫోన్, ఆయన నడిపిన బుల్లెట్‌స్పీడ్ మెజర్మెంట్ వివరాలు, మండల మేజిస్ట్రేట్ తుది నివేదిక తదితర వివరాలు అడిగినట్లు రోనాల్డ్ రాజు తెలిపారు. పోలీసు శాఖ ఇచ్చిన సమాచారాన్ని బట్టి కేసు పూర్తి వివరాలు ఇవ్వకుండా దర్యాప్తు ఇంకా కొనసాగుతోందంటూ కారణం చెబుతున్నారని భావించాల్సి వస్తోందని న్యాయవాది రోనాల్డ్ రాజు పేర్కొన్నారు.



# నేడు శిరగాలపల్లికి మంత్రి నిమ్మల రాక



**యలమంచిలి,మేజర్ న్యూస్:** యలమంచిలి మండలం శిరగాల పల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు విచ్చేస్తున్నారని టిడిపి మండల అధ్యక్షులు మామిడి శెట్టి పెద్దిరాజు తెలిపారు. ఎంజిఎన్ఆర్ఈజిఎస్ - పి ఆర్ నిధులు రూ. 10 లక్షలతో నిర్మించిన పిడిఆర్ అండ్ బి రోడ్ లోని శిరకాలపల్లి జంక్షన్‌లో గల సిసి రోడ్లు, డ్రైన్స్ ప్రారంభించ నున్నారు. అలాగే శిరగాలపల్లి అరుంధతి పేటలో రూ పది లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు డ్రైన్స్‌ను ప్రారంభిస్తారు. జల జీవన్ మిషన్ నిధులు రూ. 75.5 లక్షలతో మంచినీటి పథకం పనులకు శంకుస్థాపనలు చేస్తారు అనంతరం గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు పెద్దిరాజు తెలిపారు. నాయకులు కార్యకర్తలు అభిమానులు టిడిపి,బిజెపి,జనసేన కూటమి నాయకులంతా విధిగా హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించండి





- కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సమావేశంలో ఎమ్మెల్యే చింతమనేని

**పెదవేగి,మేజర్‌న్యూస్:** గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో క్రమశిక్షణతో మెడికల్ షాపులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న ది.ఏలూరు రూరల్ ఏరియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సంఘ సభ్యులకు తాను ఎల్లప్పుడూ అన్ని విధాల అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం పలువురు కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ది ఏలూరు రూరల్ ఏరియా కెమిస్ట్అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు,సంఘ సభ్యులు ఎమ్మెల్యేచింతమనేని ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాలతో సత్కరించారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు, సభ్యులతో సమావేశమైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ షాపులు నిర్వహించే నిర్వాహకులపై తనకు ఎల్లప్పుడూ కూడా సహృద్భావం ఉంటుందని, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ప్రజలకు మంచి సేవలందించాలని, ఈ కార్యక్రమంలో ఏలూరు రూరల్ ఏరియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు అక్కల చంద్రమోహన్, ఉపాధ్యక్షులు పెనుమాక వాసుదేవరావు, కోశాధికారి మట్టా వెంకటనారాయణ,సహాయకార్యదర్శి శిరుగుబత్తుల గంగాధరరావు, సభ్యులు గూడూరు శ్రీనివాసరావు,రాజులపాటి లక్ష్మీనారాయణ,పలివెల ఆంజనేయులు,పరసా శ్రీనివాసరావు, తాతాఅశోక్‌కుమార్, బొల్లా మధుబాబు, వీరంకి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దండి : విప్ 'బొలిశెట్టి '

- ప్రజాధనాన్ని దోచుకున్న వారు చరిత్రలో 'కొట్టు' కుపోయారు



**పెంటపాడు,మేజర్ న్యూస్** : గ్రామాల సమగ్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని, ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని అందుకు డ్వాక్రా మహిళలతో పాటు గ్రామాలు ఒక కట్టుబాటు చేసుకోవాలని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలియజేశారు. పెంటపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాధనాన్ని దోచుకుని దుర్వినియోగం చేసిననాయకులు చరిత్రలో "కొట్టు"కుపోయారని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన అభివృద్ధి పనులకు రూపకల్పన చేస్తున్నామన్నారు గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వ నిధులను కేటాయిస్తున్నామని అన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోరాష్ట్రంఆర్థిక సంక్షోభం లో కూరుకుపోయిందని అటు వంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్రం ప్రభుత్వ నిధులు,రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరూ సాయపడాలని అటువంటి వారి పేర్లు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. పొడి చెత్త తడి చెత్త లను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం అపరిశుభ్రం చేయడం సరికాదని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎంపిటీసీలు ఎంపీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### నేడు పెదవేగి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ కు అంతరాయం

**పెదవేగి,మేజర్ న్యూస్** : పెదవేగి 132 కేవీ సబ్ స్టేషన్ లో 50 యం వి.ఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ పెడుతున్న కారణం ఈనెల 28వ తేదీ శనివారం ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు33/11 పెదవేగి సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేద్కర్ఒకప్రకటనలో తెలిపారు. కనుక వినియోగదారులు సహకరించాలని అయన కోరారు.

### విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు



**పెనుమంట్ర,మేజర్ న్యూస్** : సామాన్యుని సైతం అసామాన్యుడిగా ఉన్నత శిఖరాల అవరోధించాలంటే విద్య ఒకటే ఏకైక మార్గమని ప్రధానోపాధ్యాయురాలు బిడిఎస్ సరస్వతి అన్నారు. శుక్రవారం పొలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒంగోలు ట్రిపుల్ ఐటి స్థానం దక్కించుకున్న పిల్లి రత్న శ్రీ ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని క్రమశిక్షణ తో కూడిన విద్య ఉన్నతమైనదని ఆమె అన్నారు. మాజీ సర్పంచ్ చింతపల్లి రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తర్ఫీదు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రత్న శ్రీ మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచిందని చెప్పారు. బుంగ రాజశేఖర్ మాట్లాడుతూ రత్న శ్రీ ని ఆదర్శంగా తీసుకుని పదవ తరగతి విద్యార్థులు చదివి మంచి మార్కులు సాధించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆళ్ల రాము, సర్పంచ్ కాకర రాజేశ్వరరావు, మాజీ సర్పంచ్ చింతపల్లి రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెనుమెత్స వివేక రాఘవేందర్ రాజు, బిజెపి గ్రామ అధ్యక్షులు యామజాల విశ్వనాథం, రాజశేఖర్, సత్యనారాయణ, ఎస్ఎంసి కమిటీ సభ్యులు కోడి చంద్రశేఖర్ పాండురంగారావు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు వైసిపి, సిపిఎం మద్దతు




**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను, కార్మికులకు పర్మినెంట్ చేయాలని, ఇతర న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గత ఐదు రోజులుగా దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. కాగా శుక్రవారం దీక్షా శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, కౌన్సిలర్లు సందర్శించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్మిక నాయకులతో చర్చలు జరిపి సమ్మె విరమించి ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను ప్రభుత్వం తొలగించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కవురు పెద్దిరాజు దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ కార్మికుల్లో టెక్నికల్ సిబ్బందికి రు.29,200/-లు, నాన్ టెక్నికల్ సిబ్బందికి రు. 24,500/-లు వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.తగిన విద్యార్హతలు కలిగి ఉండి 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయకపోవడం దారుణమని అన్నారు. ఒకవైపు పెరిగిన ధరలు, మరోవైపు చాలీచాలని వేతనాలతో ఔట్‌సోర్సింగ్ కార్మికులు తమ జీవిత అవసరాలను తీర్చుకోలేని దయనీయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యం తగదని హితవు పలికారు. సమస్యల పరిష్కారం కొరకు కార్మికులు సమరశీల పోరాటాలు చేయాలని అందుకు సిపిఎం మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బూడిద జోగేశ్వరరావు, నోముల కొండ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హెలెన్ కెల్లర్ డే వేడుకలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** పరివర్తన్ బధిరుల పాఠశాల,జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సంయుక్తంగా హెలెన్ కెల్లర్ డే ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విభిన్న ప్రతిభా వంతులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, దివ్యాంగుల సంక్షేమం కోసం అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. హెలెన్ కెల్లర్ జీవితం,ఆమె సాధించిన విజయాలు,దివ్యాంగుల హక్కుల కోసం ఆమె చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.హెలెన్ కెల్లర్ కేవలం ఒక వ్యక్తి కాదు,ఆమె అసాధ్యాలను సుసాధ్యం చేయగల మానవ సంకల్పానికి ప్రతీక. ఆమె జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకం. దివ్యాంగులు సమాజంలో సమాన అవకాశాలు పొందేలా మనం కృషి చేయాలని అన్నారు. పరివర్తన్ బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తమ పాఠశాల దివ్యాంగ పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారిని స్వావలంబన దిశగా ప్రోత్సహిస్తోందని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, డి.డి.ఆర్.సి సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి





### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం,మేజర్‌న్యూస్:** శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి భవ్య భీమవరం, పారిశుధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల ఆక్రమణల తొలగింపు, తదితర అంశాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి,ఆర్డిఒ కే. ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవ్య భీమవరం ప్రాజెక్టులో భాగంగా పట్టణంలో దాతల సహకారంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ఇంకా ప్రారంభం కాని పనులు ప్రారంభించేందుకు దాతలతో సంప్రదించి పనులు ప్రారంభించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ఈ సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న పాత బస్టాండ్ పనులు, పట్టణంలో పార్కులలో ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో రోడ్డు మార్జిన్లు ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారని అటువంటి వారిని గుర్తించి తొలగించాలన్నారు. అదేవిధంగా అనుమతి లేకుండా ఎక్కడబడితే అక్కడ పెద్ద పెద్ద హోల్డింగులను ఏర్పాటు చేస్తున్నారని వాటిని తక్షణమే తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్కు ప్రదేశాలు గుర్తించి మార్కింగ్ చేయాలని ఆ ప్రదేశంలోనే వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో వ్యాపార సంస్థలు, పాఠశాలలు, కళాశాలల వద్ద సీసీ కెమెరాలు ఆయా యాజమాన్యాల ద్వారా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య సిబ్బంది ఉదయం 5 గంటలకే విధులు ప్రారంభించాలన్నారు. తాను ఆకస్మికంగా పర్యటిస్తానని పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటానన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా త్రాగునీరు కలుషితం కారణంగా ప్రజలు డయేరియా బారిన పడకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

జిల్లాలో ఇప్పటికే ప్లాస్టిక్ నిషేధం ఉన్నందున ఎక్కడ కూడా ప్లాస్టిక్ వాడకుండా నిఘ పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. సూర్య ఘర్ పథకం కార్యక్రమంలో భాగంగా సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలో చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వచ్చే సమావేశం నాటికి పనులు ప్రగతిని, తాజా నివేదికలతో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు.ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, భీమవరం మునిసిపల్ కమీషనర్ కె.రామచంద్రా రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి పార్థసారధి, అసిస్టెంట్ కమీషనర్, హెల్త్ ఆఫీసర్, మున్సిపల్ ఇంజనీర్లు, డిఇలు పాల్గొన్నారు

## ఘనంగా శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి 111వ సంబరం



**పెనుమంట్ర,మేజర్‌న్యూస్ :** మహోత్సవంలో భాగంగ శుక్ర వారం శ్రీ గౌరీ శంకర దేవాంగ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నాలుగో రోజు శ్రీ మావుళ్ళమ్మ అమ్మ వారి కి మామిడి పళ్ళ తో ప్రత్యేక అలంకరణతో దర్శనం ఇచ్చారు.అమ్మవారి భక్తుడు విజయ దుర్గా ఫ్రూట్స్ (శంకర్) వెలగలేరు వారు మామిడి పళ్ళను సమర్పించారు. వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ శ్రీ మావుళ్ళమ్మఅమ్మవారి ఉత్సవ కమిటీ వారు తెలిపారు.ఈ అలంకరణ కమిటీ సభ్యులు పిచ్చుక మహేష్, కొడవటి భద్ర రావు, కొమ్మాని సాయి, పిచ్చుక పూర్ణ వరప్రసాద్, వట్టం అశోక్, అల్లాడి గిరి కుమార్, మహేష్ .భద్రరావు . అశోక్. పూర్ణ వరప్రసాద్ పాల్గొన్నారు. రేపు వచ్చే ఆదివారం సాయంత్రం ఐదు గంటలు నుండి భారీ అన్న సమారాధన జరుగునని కమిటీ సభ్యులు పిచ్చుక మహేష్ తెలిపారు.

## 29న చించినాడ అమరవీరుల 75వ వర్ధంతి సభ

**- హాజరు కానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు**

**యలమంచిలి,మేజర్‌న్యూస్:** ఆనాడు పేదల పక్షాన నిలబడి 1941 -1951 మధ్యకాలంలో భూస్వామ్య గుండాలు, పోలీసు తూటాలకు బలైన మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన అమరులైన ఆర్ గోపాల రాజు,అయ్యపరాజు,బూసి వెంకట్రావు, బూసి మసలయ్య, అల్లూరి రామరాజు తదనంతరం 1977 - 80 మధ్యకాలంలో వీరవల్లి నారాయణ, యాండ్ర సత్యనారాయణ, పంతకాని సూరన్న, కలగంపూడి గ్రామానికి చెందిన గుబ్బల రామలింగయ్య,కాజగ్రామానికి చెందిన అనిశెట్టి కాళిదాసు,గుబ్బల సాంబమూర్తి తదనంతరకాలంలో అమరులైన వారిని స్మరించుకొంటూ ఈనెల 29వ తేదీన ఆదివారం చించినాడ అమరవీరుల స్మారక స్థూపం వద్ద అమరవీరుల 75 వ వర్ధంతి సభను నిర్వహించినట్లు మండల కార్యదర్శి కానేటి బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు,ఈ వర్ధంతి సభలో రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి బలరాం,రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం,జిల్లా కార్యదర్శి ఎ రవి, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జె ఎన్ వి గోపాలన్, మాజీ ఎమ్మెల్యే సిపిఎం నాయకులు దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, సీనియర్ నేతకేతా సూర్యారావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, తదితర నాయకులు హాజరవుతున్నారని, ఈ సభలో సీనియర్ నేత కేతా సూర్యారావు రచించిన "చించినాడ సమరశీల పోరాట చరిత్ర" అనే పుస్తకాన్ని నాయకులు చేతుల మీదుగా ఆవిష్కరిస్తారని ఈ వర్ధంతి సభలో మండలంలోని ముఖ్య నాయకత్వం సభ్యులు సానుభూతి పరులు శ్రేయోభిలాషులు ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని బాలరాజు కోరారు.

## పారిశుధ్యాన్ని పరిశీలించిన ఎంపీడీవో



**కుకునూర్, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులను స్థానిక ఎంపీడీవో నరసింహారావు పరిశీలించడం జరిగింది వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ మండలమైన కుక్కునూరులో 15 గ్రామ పంచాయతీలలో గ్రామాలను ప్రతిరోజు గ్రీన్ అంబాసిడర్ ద్వారా శుభ్రంగా చేయించుకోవాలని తడి పొడి చెత్తను వేరువేరుగా గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని ప్రజలు చెత్తను రోడ్లపై కాలువలపై పడేయకూడదని అలా పడేయడం వల్ల దోమలు పెరిగి డెంగ్యూ మలేరియా మొదలైన జ్వరాలకు దారి తీస్తాయని అలాగే గుంటలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని ఎవరికివారు వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు ఈ సందర్భంగా తెలియజేశారు

# 1100 కాల్ సెంటర్ కు అందిన అర్జీల పరిష్కారంపై తక్షణ చర్యలు



– అధికారులకు జేసి రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశం

**భీమవరం,మేజర్ న్యూస్ :** ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ఏర్పాటు చేసిన 1100 కాల్ సెంటర్ అందిన అర్జీల పురోగతిపై శు క్రవారం కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నందు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, రెవిన్యూ, పంచాయతీ, సర్వే, మున్సిపల్, వైద్యశాఖ,ఎలక్ట్రిసిటీ,కోపరేటివ్,గృహ నిర్మాణం,సివిల్ సప్లై,ఇరిగేషన్, స్టాంపు అండ్ రిజిస్ట్రేషన్, దేవాదాయ శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అర్జీదారులు పెట్టుకున్న సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో విచారణచేసి పరిష్కరించాలన్నారు. 1100 గ్రీవెన్స్ పిటిషన్ లు నిర్ణీత గడువు లోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో స్వీకరించబడిన ఫిర్యాదులను సరైన జవాబుదారీతనంతో పరిష్కరించాలని అన్నారు. మండల స్థాయి అధికారుల లాగిన్ లో ప్రతి ఫిర్యాదుని పరిష్కరించే సమయంలో సంబంధిత జిల్లా అధికారి,ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చి ఫిర్యాదును ముగించాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు పరిష్కారంలో కొన్ని శాఖల అధికారులు నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనబడుతుందని అట్టి వారిపై చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, డ్వామా పిడికెసిహెచ్ అప్పారావు,డిపిఓ రామ్ నాద్ రెడ్డి,డిఎం అండ్ హెచ్ ఓ గీతా బాయి,డీఎస్ఓ ఎన్.సరోజ,జిల్లా సర్వే ఇన్చార్జి అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా గృహ నిర్మాణ శాఖాధికారి జి.పిచ్చయ్య,జిల్లా సహకార శాఖ అధికారి మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామ చంద్రారెడ్డి, ఇరిగేషన్ అండ్ డ్రైన్స్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఎలక్ట్రికల్, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్, ఫిషరీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సెయింట్ థెరిసా మహిళా కళాశాల అధ్యాపకులకు డాక్టరేట్‌లు



**ఏలూరు,మేజర్న్యూస్ :** స్థానిక సెయింట్ థెరిసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాల గణిత శాస్త్ర విభాగానికి చెందిన ముగ్గురు అధ్యాపకులు చత్తీస్ ఘడ్ రాష్ట్రం లోని నయా రాయపూర్ లో కళింగ యూనివర్సిటీ నుంచి2025 జూన్ నెలలో డాక్టరేట్ పట్టాలను పొందారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ కళాశాలలో 25 మంది అధ్యాపకులు డాక్టరేట్ పట్టాలు కలిగి ఉన్నారని, ఇప్పుడు అదనంగా ముగ్గురు అధ్యాపకులు డాక్టరేట్ పట్టాను పొందడం తమకు గర్వ కారణమన్నారు. గణితశాస్త్ర విభాగంలోని ఏ దుర్గాదేవి" సమ్ రిజల్ట్స్ ఆన్ ఈవెన్ మినీనైజేషన్ ఆఫ్ మల్టిప్లికేషన్ లేబరింగ్' అంశంపై డాక్టర్ జి వి వి జగన్నాధ రావు మార్గదర్శకత్వంలో ఏ జ్యోతి ఏ స్టడీ ఆన్ ఆల్జీబ్రిక్ గ్రాఫ్స్ విత్ ఫజ్జి ఐడియల్స్ అండ్ మాడ్యూల్స్ అనే అంశంపై డాక్టర్ రిషికాంత్ అగ్నిహోత్రి మార్గదర్శకత్వంలో,గార్లపాటి జ్యోతి మ్యాథమెటికల్ మోడల్ ఇన్ యూనిక్నెస్ ఇన్ నాన్ లీనియర్ ఆర్డినరీ డిఫరెన్షియల్ ఈక్వేషన్స్' అనే అంశంపై ప్రొఫెసర్ ప్రధాన్ మార్గదర్శకత్వంలో పీహెచ్డీ పట్టాలను సాధించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ పి మెర్సి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ పి సునీల రాణి,కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సిస్టర్ సుశీల,ఇతర అధ్యాపకులు వీరిని అభినందించారు.

## అప్పనవీడులో విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



**పెదపాడు,మేజర్ న్యూస్ :** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అప్పనవీడు నందు శుక్రవారం హెచ్ఎం తోట పుష్పవతి అధ్యక్షతన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్ల పంపిణీ గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో జరిగింది. ప్రధానోపాధ్యాని పుష్పవతి మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన కిట్ల ద్వారా బాగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి అప్పనవీడు కూటమి నాయకులు గరికిపాటి చంటి మాట్లాడుతూ బాగా చదువుకుంటేనే సమాజంలో మంచి గౌరవం లభిస్తుందని అందుకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని సూచించారు , పి ఎంసి చైర్మన్ మోగంటి లక్ష్మీ దుర్గ, అభయాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ వేమూరి శ్రీనివాస్,వడ్డీ వాసవి, బెక్కం శ్రీనివాస, బెక్కం లక్ష్మి నారాయణ, పా వులూరి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## సంచలనం సృష్టించిన సైనేడ్ శివ అలియాస్ సింహాద్రి కి జీవిత ఖైదు




**విజయవాడ,మేజర్ న్యూస్ :** సైనేడ్ ఉపయోగించి పది హత్యలు చేసిన ఏలూరు కి చెందిన వెల్లంకి సింహాద్రికి,విజయవాడకు చెందిన షేక్ అమీనుల్లా బాబు, ఏ.బాబుకు జీవిత కారాగార శిక్ష కోర్టు విధించింది. '2019 వ సంవత్సరంలో ఏలూరులో కాటి.నాగరాజు అనే వ్యక్తి అనుమానాస్పద మృతి పై 174 సిఆర్పిసి కేసుగా నమోదు అయింది. దీనిపై అప్పటి ఏలూరు డీఎస్పీ దిలీప్ కిరణ్ ,రూరల్ సీఐ అనుసూరి శ్రీనివాసరావు,వారి సిబ్బంది దర్యాప్తు జరిపారు.నాగరాజుది అనుమానాస్పద మృతి కాదని అంతేగాక మరో 9 హత్యలు మొత్తం పది హత్యలు చేశాడని గుర్తించి ముద్దాయి వెల్లంకి సింహాద్రిని,షేక్ అమీనుల్లా బాబులను అరెస్టు చేశారు. ఇందులో భాగంగా విజయవాడ సిటీ అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ అప్పటి కృష్ణాజిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామమునకు చెందిన గండికోట భాస్కర్ రావు హత్యపై అతని భార్య గండికోట పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు పై అప్పటి అజిత్ సింగ్ నగర్ ఇన్స్పెక్టర్ ఎస్వివి లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు.ఈ కేసు కోర్టు విచారణ దశలో సి.ఎం.ఎస్ ఇన్స్పెక్టర్ జగదీశ్వర్ రావు, ఎ.ఎస్.ఐ ఎం కోటిరెడ్డి, ప్రస్తుత అజిత్ సింగ్ నగర్ ఇన్స్పెక్టర్ బిహెచ్ వెంకటేశ్వర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యాదాల జేమ్స్ సహకరించారు.సెవెంత్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జ్ బండెళ్ళ అబ్రహం ఈ కేసు విచారణ అనంతరం ముద్దాయిలు వెల్లంకి సింహాద్రి,షేక్ అమీనుల్లా బాబుకు జీవిత కారాగార శిక్ష , చెరొక 25వేల రూపాయలు జరిమానా విధించారు.

## పార్టీ పటిష్టత కోసం కష్టపడి పని చేయాలి

ఇన్చార్జి రామరాజు



**మొగల్తూరు,మేజర్న్యూస్ :** తెలుగుదేశం పార్టీ నియోజకవర్గంలో బలంగా ఉన్నదని, మరింత పటిష్టపరిచేందుకు ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. శుక్రవారం మండలంలోనికొత్తత తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికిమొగల్తూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుబ్బల నాగరాజు అధ్యక్షత వహించారు.

ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్టీ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు మాట్లాడుతూ తెలుగుదేశం గ్రామ బూత్ స్థాయి గ్రామస్థాయి నుండి అన్ని స్థాయిలలో నూతన కమిటీలు ఎంపిక చేయడంజరుగుతుందని, పార్టీ పటిష్టత కోసం ప్రతి వ్యక్తి కష్టపడి పనిచేయాలని అన్నారు. కొత్తత నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగినది.గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా కోపనాతి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి దాసరి రాంబాబు, ఉపాధ్యక్షులుగా పుతినేని సత్యనారాయణ మొదలకు సభ్యులను కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో కొల్లాటి బాలకృష్ణ , రేవు కృష్ణ , నజోగి పండు, నాగిడి రాంబాబు కొల్లాటి మూలస్వామి, పడవల నరసింహారావు, కోపనతి రామరాజు, మోటుపల్లి రాం భాస్కర్ రావు,జక్కం శెట్టి బాలాజీ, కొప్పనాతి శ్రీనివాసు, తిరుమణి ఆంజనేయులు, పాల రాంబాబు,తిరుమని రామరాజు,ముత్యాలరాజు, కొల్లాటి పెంటయ్య, పెద్ది రాజు, మామిడి శెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## జనసేనలో చేరిన వైసీపీ నేతలు

– ఎస్సీ నేతలు,కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పిన అప్పల నాయుడు




**ఏలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక 25వ డివిజన్ పరిధిలోని శనివారపుపేట ప్రాంతానికి చెందిన 30 మందికి పైగా వైసీపీకి చెందిన ఎస్సీ సామాజికవర్గ నాయకులు,కార్యకర్తలు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. వీరిని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ చేరికల కార్యక్రమం జనసేన నాయకులు దేవరపల్లి రత్నబాబు ఆధ్వర్యంలో జరిగింది.గవరవరం, గవరవరం చెరువు గట్టు, ఇందిరా కాలనీ వంటి ప్రాంతాలకు చెందిన దేవరపల్లి శ్రీను,బొకినాల నాగేంద్ర,దుక్కిపాటి శేషు,గురింతపల్లి శ్రీను, మత్తే సుబ్రహ్మణ్యం, షేక్ షరీఫ్, కూచిపూడి అనుపమ, జమ్మలమడుగు తేరేజమ్మ, భీమడోలు సునీత, కూచిపూడి రాణి, శేషాద్రి, తిరుమలశెట్టి మల్లీశ్వరి,తిరుమలశెట్టి సంజీవ రావు, కర్రి బసవరాజు తదితరులు జనసేన కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలు, రాష్ట్రానికి అభివృద్ధి తేవాలన్న దృఢ సంకల్పం ప్రజల మనసులను ఆకర్షిస్తున్నాయన్నారు. శనివారపుపేట నుండి వచ్చిన ఈ నాయకులు అదే స్ఫూర్తితో పార్టీలో చేరారు. వైసీపీ పాలనపై విరక్తి చెందామని, వైసీపీలో అవినీతి, ప్రజల పట్ల నిర్లక్ష్యమే రాజ్యాంగా మారిందని. అందుకే చిత్తశుద్ధితో ప్రజలకు సేవ చేసే జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నాం అని నూతనంగా పార్టీలో చేరిన నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి దోనేపూడి లోవరాజు, జనసేన నాయకులు కొనికి మహేష్, వాసా సాయి, షేక్ ఖాసీం, పలువురు మహిళా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# టిడిపి నాయకులు,కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలి





## – ట్రైకార్ చైర్మన్ 'బొరగం',మాజీ ఎమ్మెల్సీ 'అంగర'

**టి.నరసాపురం,మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పని చేయాలని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు.ఇటీవల ఎంపికైన టిడిపి గ్రామ కమిటీల పరిశీలన టి.నరసాపురంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌రావు, ఆపార్టీ నియోజకవర్గ,మండల పరిశీలకులు అనపర్తి వెంకట నారాయణ,గుట్ట వెంకటేశ్వరరావు సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభం కాగానే పార్టీలో రెండు వర్గాల మధ్య కొద్ది సేపు రసాభాస జరిగింది. అనంతరం మండలంలో 15పంచాయతీలకు 12 పంచాయతీల గ్రామ కమిటీల పరిశీలన పూర్తి అయ్యింది.మిగిలిన కేతవరం, బంధంచర్ల, బండివారిగూడెం గ్రామ కమిటీల ఎంపిక పూర్తయిన అనంతరం మండల అధ్యక్ష ఎంపిక నిర్వహించబడుతుందని బొరగం శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు ,జయ్యవరపు శ్రీరామమూర్తి, కొండపల్లి రవి, మండల అధ్యక్షుడు నాయుడు రాళ్ళప్పగౌడ్, బొంతు సత్యనారాయణ,వెలిది నాగబాబు, కాల్నీడు రాంబాబు,గండబోయిన శ్రీను,ఆచంట సూర్యనారాయణ,పిన్నమనేని మధు,నల్లూరి చలపతిరావు మండం ఆదిత్య కాసనేని వెంకట్రావు, జోనుబోయినసోంబాబు,సందేపూడిప్రభాకర్ సాయి, తోట లక్ష్మీనారాయణ, కుమార్ పేరం రాంబాబు, కొల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'సూర్య 'చెప్పిందే జరిగింది

## ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ మూసివేత

నర్సాపురం,మేజర్‌న్యూస్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో 2015నుండి కొనసాగుతున్న రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు ను మూసివేశారు. ఇదే విషయమై ఈనెల 20న ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ మూసేస్తారా? అనే శీర్షిక సూర్యప్రత్రికలో ప్రచురితమైంది. ముందుగా చెప్పినట్లుగానే రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు ను మూసివేస్తున్నట్లు బోర్డు పెట్టేశారు. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేయాల్సి ఉండగా, ఈనెల 24 తో ఆ సమయం ముగిసిపోయింది. రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు నిర్లక్ష్యం వహించడంతో మూసి వేసినట్లు ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. అత్యవసర పరిస్థితులలో గర్భిణీలకు, ప్రమాదాలకు గురైన వారికి ఈ బ్లడ్ బ్యాంకు ద్వారా రక్తం అందించి ప్రాణాలు నిలిపేవారు. అది మూసివేయడంతో తీర ప్రాంత వాసులు ఆందోళనకు గురవుతున్నారు. అత్యవసర పరిస్థితిలో రక్తం కావాలంటే పాలకొల్లు వెళ్లాల్సిందే. అక్కడ రెండు బ్లడ్ బ్యాంకులు కొనసాగుతూ ఉండగా ఒకటి తాత్కాలికంగా నిలిపివేసినట్లు చెబుతున్నారు. నర్సాపురంలో 350 ఎమ్ యల్ రక్తానికి రూ.1300 పరీక్షల నిమిత్తం చార్జ్ చేసేవారు. పాలకొల్లులో రూ 2000 నుండి రూ 2500 వరకు చార్జ్ చేస్తున్నట్లు బాధితులు చెప్తున్నారు. ఒకవేళ కావలసిన గ్రూపు రక్తం అక్కడ అందుబాటులో లేకపోతే భీమవరం వెళ్లాలని, ఇదంతా జరిగేసరికి ప్రాణాలు ఉంటాయా




పోతాయా అనే అనుమానాలు ఈ ప్రాంత వాసుల్లో వస్తున్నాయి. ఇదే విషయమై ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ సుప్రియ ను వివరణ కోరగా ఆసుపత్రిలోనే బ్లడ్ స్టోరేజ్ పాయింట్ ఏర్పాటు చేసేందుకు జిల్లా ఉన్నతాధికారుల అనుమతి ఇచ్చారని, ప్రక్రియ పూర్తి అయ్యేందుకు సుమారు ఆరు నెలలు పడుతుంది అన్నారు. ఈ లోపు రక్తం అవసరమైన వారు ఇతర ప్రాంతాల నుండి తెచ్చుకోవాలని సుప్రియ తెలిపారు.

# లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

## ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ సుప్రియ



**నర్సాపురం,మేజర్‌న్యూస్:** వైద్య అవసరాల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న రోగుల నుండి గాని, వారి బంధువుల నుండి గాని ఆస్పత్రి సిబ్బంది ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలోని ఆమె చాంబర్లో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో మొగల్తూరు ప్రాంతంలోని జాతీయ రహదారిలో ఉపాధి హామీ కూలీలు మరణించారని,వారి బంధువుల దగ్గర నుండి పోస్టుమార్టం సిబ్బంది లంచం డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్య శాఖ అధికారి విచారణ జరిపారని, అది నిజమని తేలడంతో ఇద్దరు సిబ్బందిని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో దాదాపు అన్ని సేవలకు వైద్య సిబ్బంది పనిచేస్తున్నారని, వైద్యం కోసం వచ్చిన వారికి సకాలంలో సేవలు అందించకపోయిన తనకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని, ప్రజానేకమంతా దీనిని గమనించి వైద్య సేవలు పొందాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిని, వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, ఆసుపత్రి కమిటీ సభ్యులు మాదంశెట్టి కోటేశ్వరరావు, పోలిశెట్టి నలిని తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలి

## న్యాయమూర్తి గంగరాజు



**నర్సాపురం, మేజర్‌న్యూస్:** వచ్చేనెల 5వ తారీకున జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి కక్షిదారులకు సమన్యాయం అందించుటలో న్యాయవాదు లు భాగస్వామ్యం కావాలని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి.గంగరాజుకోరారు.శుక్రవారం స్థానిక బార్‌అసోసియేషన్ హాల్‌నందు న్యాయవాదులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదులు కూడా తమతమ కక్షిదారులకు లోక్‌అదాలత్ యొక్కముఖ్య ఉద్దేశంను వివరించాల న్నారు. రోజూ కోర్ట్‌లో వర్షువల్‌గా జరుగుచున్న మధ్యవర్తిత్వం ను సద్వినియోగం చేసుకొని కక్షిదారులకు సమన్యాయం అందించుటకు న్యాయవాదులు పూర్తి సహకారాన్ని అందించాలన్నారు. క్రిమినల్ కేసులతో బాటు సివిల్ కేసులు కూడా ఎక్కువగా రాజీఅయ్యేలా తమవంతుకృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్. వరలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండి బాలాజీ, కార్యదర్శి రంపా పుల్లాజి, సీనియర్ ,జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్రలో పాలిటెక్నిక్ ప్రవేశాలకు సర్టిఫికెట్లు పరిశీలన

**నర్సాపురంరూరల్,మేజర్‌న్యూస్:** మండలంలోని సీతారాంపురం లో గల స్వర్ణాంధ్రలో పాలిసెట్ 2025 ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ నెల 21నుండి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు యాజమాన్యం తెలిపింది. శుక్రవారం కళాశాల నుండి ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ వెరిఫికేషన్ ప్రక్రియ ఈ నెల 28 తో మొదటి ఫేజ్ పూర్తి అవుతుందని, కళాశాల ప్రిన్సిపాల్ హెల్పైన్ సెంటర్ కోఆర్డినేటర్ డా.కిరణ్మయి తెలిపారు. ఈ ధ్రువ పత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులుకు ఈ నెల30వ తేదీ నుండి వెబ్ ఆప్షన్ నమోదు ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు.పాలిటెక్నిక్ విద్యపై ఆసక్తి కలిగిన విద్యార్థులు మరిన్ని వివరాలకొరకు పాలిటెక్నిక్ కాలేజీ ఆఫీస్ నందు సంప్రదించగలరు.పాలీసెట్‌లో రాంక్ పొందిన విద్యార్థులు అందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి త్రినాథ్,డైరెక్టర్ అడ్డాల శ్రీహరి తెలిపారు.

# మున్సిపల్ కౌన్సిల్స్ సమావేశంలో వాదోపవాదాలు





**నరసాపురం,మేజర్‌న్యూస్ :** మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో పట్టణంలోని డ్రైన్లలో షిల్టు తొలగింపు కార్మికులకు ప్రభుత్వ పాఠశాలను వసతి గా ఇవ్వటాన్ని పలువురు కౌన్సిలర్లు వ్యతిరేకించారు.శిల్ట్ తొలగించేందుకు కాంట్రాక్టు తీసుకున్నారని, దానికి సంబంధం చిన కార్మికులకు కాంట్రాక్టర్ అన్ని సౌకర్యాలు ఇవ్వాలని ప్రభుత్వ పాఠశాల ఇవ్వడం ఏమిటని వైస్ చైర్ పర్సన్ కామన నాగిని ప్రశ్నించారు. ఈ విషయాన్ని నిరసిస్తూ చైర్ పర్సన్ పోడియం దగ్గర కూర్చుని నిరసన తెలిపారు. కొద్దిసేపు కౌన్సిలర్లు రెండు గ్రూపులుగా ఏర్పడి వాదావవాదాల చేసుకున్నారు. దీనంతటికీ మున్సిపల్ అధికారులే కారణమని వారు సమాధానం చెప్పాలని నాగిని భీష్మించారు. మరి కొంతమంది కౌన్సిలర్లు ఆమెకు సర్ది చెప్పి దీనిపై విచారణ చేస్తామన్నారు. దీంతో నిరసన విరమించారు. అనంతరం ఇతర విషయాలపై చర్చించారు.